

యూరియా.. ఏదయా..?

• రైతులకు తప్పని తిప్పలు

• రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టామని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. అక్కడ దొరక్కపోవడంతో రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు...

ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి ఎరువులు వస్తున్నాయని తెలియడం ఆలస్యం వ్యవసాయ పనులు మాను కొని గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉంటున్నారు. ఎరువుల కొరత నెలకొందనే సమాచారం రైతులను కలవర పెడుతోంది. ఖరీఫ్ సాగు సీజన్ ముంచుకొచ్చినా ఆశించిన స్థాయిలో నిల్వలు చేరలేదు. విత్తు మొలకెత్తాక డిఎపి, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ పాస్ఫేట్ వంటి ఎరువులు వినియోగిస్తారు. ఇక పైర ఎదుగుదలలో నత్రజని (యూరియా) ఎరువులను వాడ తారు. సరిపడ ఎరువులు లేవనే సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 877 ఆర్బీకేలు ఉండగా 188 మూతపడి 689 మాత్రమే ఉన్నాయి. వీటికి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ఇవ్వకుండా పిఏసిఎస్‌లకు, డిసిఎంఎస్‌లకు సరఫరాల చేస్తున్నారు. ఆ సొసైటీలు 'కూటమి' పార్టీల నేతల చేతుల్లో ఉండటంతో వీటికి సరఫరా అవుతున్న యూరియా పలుకుబడి ఉన్న వారికే వెళ్లిపోతోంది. రైతులకు అందడం లేదు. ఏపి మార్క్‌ఫెడ్ వద్ద 401.4 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 398.67 మెట్రిక్ టన్నులు, రిటైల్ల దగ్గర 384 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీల వద్ద 54.535 మెట్రిక్ యూరియా నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మరో 2187.39 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉందని అంటున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులకు తిప్పలు తప్పడం లేదు. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఎరువుల కోసం పరుగులు తీస్తున్నారు. గ్రోమర్ 28-28-0, ఫ్యాక్టంఫాస్ 20-30-0-18, గోదావరి డీఏపీ, 16-28-26, 14-35-14 తదితర మిశ్రమఎరువుల కోసం రైతు సేవా కేంద్రాలు, ప్రయివేటు ఎరువుల దుకాణాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు వచ్చిన కాంప్లెక్స్ మిశ్రమ ఎరువులను అక్కడి సిబ్బంది అమ్మేసుకొంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నూటికి 90 శాతం రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా అయినప్పటికీ రాజకీయ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే చేరుతోంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఒక రైతుకు గరిష్టంగా 9 సంచులు ఇవ్వాల్సి నిబంధన ఉన్నప్పటికీ రాజకీయ నేతలు ఒక్కొక్కరికి 10 బస్తాలకుపైగా విక్రయిస్తున్నారు. అధికారులు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఫోటోలిచ్చి హాజరు వేసుకుని వస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆదోని మండలం పెద్దహరివాణంలో ఎరువుల కోసం రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నా...



గత నాలుగు రోజుల నుంచి యూరియా కోసం స్థానిక వ్యవసాయ కార్యాలయానికి తిరుగుతున్నా దొరకడం లేదు. శుక్రవారం యూరియా వచ్చింది. నాకంటే ముందు ఉన్న రైతులకే సరిపోయింది. నాతో పాటు చాలామంది రైతులు ఆ రోజు యూరియా దొరకక వెనుతిరిగారు. ఈ రోజు వచ్చాను. ఈ రోజు కూడా స్టాక్ లేదు. మరో రెండు రోజులు కావచ్చు అంటున్నారు. బయట మార్కెట్లో కూడా యూరియా దొరకడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి అవసరమైన యూరియా బస్తాలను ఇవ్వాలి.

- హనుమంతు, కోసిగి.

ఎరువులు అందక నానా ఇబ్బందులు



సొంతంగా మూడెకరాలతో పాటు, పదెకరాలు సాగు చేస్తున్నాను. 13 ఎకరాల్లో పత్తి పెట్టినప్పటికీ సకాలంలో ఎరువుల వేయకపోవడంతో పత్తి పంట ఎదుగుదలలేదు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి సకాలంలో రైతులకు ఎరువులు అందించాలి.

- రంగస్వామి, రైతు, పెద్దహరివాణం, ఆదోని మండలం

రైతులతో ఉద్యమాలకు సిద్ధమవుతాం..



యూరియా విషయంలో రైతుల ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదు. కూటమి ప్రభుత్వం రైతులపై చిన్న చూపు చూస్తోంది. సరైన సమయంలో రైతులకు యూరియా అందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతాం.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

'పి4'లో భాగస్వాములు కండి

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పేదలను ఆదుకునేందుకు పి4 విధానంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, తదితరులతో భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో అవసరం ఉన్న వారికి సహాయం చేయడం పుణ్య కార్యమని, ఈ అవకాశం పి4 విధానం ద్వారా లభిస్తోందని పేర్కొన్నారు. అందరమూ ఎప్పుడో ఒకప్పుడు సహాయం పొంది ఉంటామని గుర్తు చేశారు. మనం చేసే చిన్న సహాయం అవసరం ఉన్న కుటుంబానికి ఎంతో ఆసరా ఇస్తుందని, సమాజంలో సహాయం చేయగలిగే సామర్థ్యం ఉన్నవారు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సర్వే చేసి 64 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించినట్లు తెలిపారు. బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసే వారిని మార్గదర్శులుగా పేర్కొనడం జరుగుతోందని, ఇప్పటి వరకు 22 వేల కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులుగా ముందుకొచ్చారని చెప్పారు. మిగిలిన కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులుగా ముందుకు రావాలని కోరారు. జెసి డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పిజిఆర్‌ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను ఆదేశించారు. వారం రోజుల నుంచి అర్జీలు చూడకుండా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అధికారులను ఆదేశించారు. జెసి బి.నవ్య, డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. పరిపూర్ణ అధ్యయన సాధనంతో పూర్తిగా మాట్లాడే పాకెట్ లైబ్రరీ (డైసీ మెషిన్) విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు డైసీ మెషిన్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

81, 82వ సచివాలయాలు ఖాళీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలోని 32వ వార్డు ముజఫర్ నగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న 81, 82 సచివాలయాలను ఖాళీ చేయాలని నాయకులు కోరారు. సోమవారం ప్రజా సమస్యల ప్రజా వేదికలో నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వ నాథ్‌ను సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు జి.ఏసు కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ... ముజఫర్‌నగర్‌లో ఉన్న నండూరి ప్రసాదరావు కమ్యూనిటీ హాలు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలకు వివాహాలు, ఫంక్షన్లు చేసుకోవడానికి, పొదుపు గ్రూపుల సమావేశాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సచివాలయాల కోసం కేటాయించాలని ఒత్తిడి చేయడంతో ఆరు నెలల్లో ఖాళీ చేస్తామని అప్పటి కమిషనర్ హామీ మేరకు సచివాలయాలకు కేటాయించి దాదాపు ఆరేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఖాళీ చేయలేదని చెప్పారు. రూ.లక్షల ఖర్చు చేసుకోలేని పరిస్థితిలో కమ్యూనిటీ హాల్ ఆరు బయటనే వివాహాలు చేస్తున్నారని తెలిపారు. సచివాలయాల నిర్మాణం కోసం ముజఫర్ నగర్ నీళ్ల ట్యాంక్ దగ్గర స్థలం కేటాయించి పనులు మొదలుపెట్టి నిర్మాణాన్ని కరోనా సందర్భంగా ఆపేశారని తెలిపారు. నిర్మాణం చేపట్టి ప్రజాప్రయోజనాల కోసం సచివాలయాలు ఖాళీ చేసి నండూరి ప్రసాదరావు కమ్యూనిటీ హాలును అప్పగించాలని కోరారు. త్వరలోనే సచివాలయాల నిర్మాణం చేపట్టి కమ్యూనిటీ హాలును అప్పగిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ
- కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఇంకా రైతుల వద్ద ఉన్న పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. అలాగే ఇక్కడ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన చేపట్టారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శులు ఎ.కృష్ణ, పి.కోటకొండ సూరి, జిల్లా ఉపాధ్యక్షులు సి.హనుమంతు నాయకత్వంలో జరిగిన నిరసననుద్దేశించి రామకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వాలు రైతులకు అనుకూలమైన చర్యలు చేపట్టడం లేదనడానికి ఇదొక నిదర్శనమని ప్రభుత్వంపై మండిపడ్డారు. నాలుగు నెలలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రయివేట్ కంపెనీల ద్వారా రైతుల దగ్గర మిగిలి ఉన్న పొగాకును కొనుగోలు చేయించలేకపోతున్నారని విమర్శించారు. ఇదేనా రైతు ప్రభుత్వమంటే అని నిలదీశారు. జిల్లాలో ఎమ్మిగనూరు, వెల్దుర్తి, ఓర్వకల్లు, కల్లూరు, కర్నూలు మండలాల్లో పొగాకు సాగు చేస్తే ఇప్పటికీ రైతుల దగ్గర కొనుగోలు చేయకుండా నిల్వ పెట్టారని తెలిపారు. రైతులు నష్టపోయి తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి కృష్టికి కూడా తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. మిగిలి ఉన్న పొగాకు రైతుల దగ్గర ఉండడం చేత కొంతమంది దళారులు రైతుల దగ్గరికి వెళ్లి క్వింటా రూ.800, రూ.1500, రూ.3 వేలు, రూ.3,200, రూ.5 వేల చొప్పున తీసుకొని లాభం పొందుతున్నారన్నారు. గత రెండు వారాల క్రితం కలెక్టర్ స్పందించి కంపెనీల వారు కొనుగోలు చేసే విధంగా చేస్తామని చెప్పారని, ఆచరణలో రైతులకు ఏమాత్రం మేలు జరగలేదని తెలిపారు. రైతులు పూర్తిగా నష్టపోక ముందే సరసమైన ధరతో మిగిలి ఉన్న పొగాకునంతా కొనుగోలు చేసే విధంగా కంపెనీలను ఆదేశించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ తక్షణమే స్పందించి... గ్రామాల్లో వ్యవసాయ శాఖాధికారులు వెళ్లి అగ్రిమెంట్లు ఉన్న పొగాకును కొనుగోలు చేయడం, మిగతా వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపించాలన్నారు. రైతులకు సహాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నన్నూరు మధు, మహేష్, మల్లేశ, ఉల్చాల శ్రీనివాస్ రెడ్డి, మద్దిలేటి, నాలుగు మండలాల రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో వినూత్నంగా అర్ధనగ్న నిరసన ప్రదర్శన

ఇందిరాగాంధీ నగర్ కొట్టం బడి స్థలాన్ని కాపాడండి

కమిషనర్‌ను కోరిన 43 వ వార్డు కొట్టంబడి పరి రక్షణ కమిటీ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో రోడ్డు పరం పోగు స్థలంలో గత 60 సంవత్సరాల క్రితం ఇందిరా గాంధీనగర్ పివి నరసింహారావునగర్,ఇల్లూరునగర్ తదితర ఏరియాల లో నివసిస్తున్న పేదప్రజల పిల్లలు చదువుకునేందుకు కాలనీవాసులందరూ చందాలు వేసుకొని కొట్టంబడి ఏర్పాటు చేసుకున్నారు. కొట్టంబడి (ఎయిడెడ్ పాఠశాల) హెడ్ మాస్టర్‌గా ఉన్న రోజ్‌మండ్ బడి స్థలాన్ని కాజేయాలన్న దురుద్దేశంతో బడి నడుస్తుండగానే తాను కాపురం ఉన్నట్టుగా అప్పటి తహసీల్దార్‌ను ప్రలోభ పెట్టి అక్రమంగా పట్టా తీసుకొని ఎవరికీ తెలియకుండా తన ఇద్దరి కూతుర్ల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఆ ఇద్దరు కూతుర్లు వేరే వాళ్లకు ఆ స్థలాన్ని అమ్మి రిజిస్ట్రేషన్ చేయించారని, బడి నడుస్తుండగానే బడి స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అక్రమ రిజిస్ట్రేషన్లలను రద్దు చేయాలన్నారు. ఇల్లు పేరుతో వేసిన ఇంటి పన్నును రద్దు చేయాలన్నారు. కొట్టం బడి స్థలాన్ని కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకొని ప్రజల ప్రయోజనాలకోసం కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం లేదా వార్డు సచివాలయం నిర్మించాలని కోరారు. కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో 43వ వార్డు కార్పొరేటర్ కె.మునెమ్మ, మాజీ కార్పొరేటర్ టి.రాముడు, కొట్టం బడి పరిరక్షణ కమిటీ సభ్యులు కె.మల్లికార్జున, ఎస్.రోశయ్య, ఎం.భాస్కర్, ఎం.లోకేష్ వినతి పత్రం ఇచ్చారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ విచారణ చేసి వీధి ప్రజలకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కూటమి పాలనలో అభివృద్ధికి అడుగులు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

అభివృద్ధి, సంక్షేమ పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం కోడు మూరు మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధికి కొత్త ఊపిరిలూదిందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం మౌలిక సదుపాయాల కల్పన సమర్థవంతమైన పాలన ద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో అమలుపరిచిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలపైదృష్టి సారించి వాటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మండల టిడిపి కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో కోడుమూరు నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. వారి సహకారంతో కోడుమూరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేలా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి కోడుమూరు మండల టిడిపి కన్వీనర్ రామకృష్ణారెడ్డికి గ్రామ ప్రజలు పూల వర్షం కురిపించి మేళతాళాలతో స్వాగతం పలికారు. గోరంట్ల సర్పంచి బాలకృష్ణ, అయ్యప్ప, బలరాముడు, వెంకటగిరి ఎంపిటిసి నారాయణ, కట్టెల రాజు తదితరులు పాల్గొన్నారు.



అందరి సహకారంతో కెఎంసి అభివృద్ధి

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ విసి డాక్టర్ పి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీ అభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యం అని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీని సందర్శించిన సందర్భంగా ప్రిన్సిపల్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అందరూ దూరదృష్టితో ఆలోచించి సహకరించాలన్నారు. ఎవరికీ ఇబ్బంది కలుగకుండా చూడాలని అన్నారు. విసిగా ఉన్నందున ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి అభివృద్ధికి సహకరించే అవకాశం వుందని, ఈ కళాశాల విద్యార్థిగా ఆసుపత్రి సూపర్డెంట్‌గా. కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసిన అభిమానంతో కాలేజీ అభివృదికి మరింత సహకారం అందిస్తారని ఇందుకు అల్యూమిని వైద్యులు, కాలేజీ, వైద్యులు విద్యార్థులు అందరూ కలిసి కట్టుగా సమన్వయం ముందుకి వస్తే పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సింధియా శుభప్రద, అల్యూమిని వైద్యులు డాక్టర్‌కుమార్ స్వామి రెడ్డి, డాక్టర్ గోవిందరెడ్డి, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సుబ్బారెడ్డి, ఎపిజిడిఎ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, డాక్టర్ విజయశంకర్, ఇన్చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవులు ఇంజనీరింగ్ సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.చంద్రశేఖర్


హెపటైటిస్ పట్ల అవగాహన అవసరం

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

'అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జులై 28న నిర్వహిస్తారు. దీని ముఖ్య ఉద్దేశం వైరల్ హెపటైటిస్ వ్యాధి వల్ల కలిగే ప్రపంచ వ్యాప్తి భారాన్ని , దీని గురించి అవగాహన పెంచడం. వ్యక్తులు, సంస్థలు ప్రభుత్వాలు కలిసి హెపటైటిస్‌ను అరికట్టడంలో ప్రయత్నం చేయాలి.' అని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, లివర్‌స్పెషలిస్టు డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో...

ఈ సంవత్సరం 'హెపటైటిస్ మనం విడమర్చి ఆలోచించుదాం' అనే థీమ్ తో ముందుకు వెళ్తున్నారు. అంటే హెపటైటిస్ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఈ సంవత్సరం థీమ్ తెలియజేస్తుంది. ఇది సాధారణంగా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కలుగుతుంది. కానీ ఇతర కారణాలు కూడా ఉండవచ్చు, ఉదాహరణకు వ్యాధులు, మందులు, మత్తు పదార్థాలు, విషాలు , మద్యం తీసుకోవడం వల్ల వైరల్ హెపటైటిస్ ఐదు ప్రధాన రకాల వైరస్‌ల ద్వారా కలుగుతుంది. వైరల్ హెపటైటిస్ లో ఎ, బి, సి, డి, ఇ రకాలుగా ఉన్నాయి. ఒబేసిటీ, డయాబెటిస్, హైపర్ టెన్సన్, హైపర్ కొలాస్ట్రాల్ ఉన్నవాళ్లకు వచ్చే అవకాశం ఉంది. 'ఎ' చిన్నపిల్లలకు వస్తుంది. 'ఇ' పెద్దవాళ్లకు వస్తుంది. సి,డి వస్తే వాటిని నయం చేయడం కొంత కష్టం. సి మాత్రం క్యూరబులిటీ డిసీస్‌గా చెప్పవచ్చు. బి హెపటైటిస్ ముదిరితే లివర్ మీద ఎక్కువ ప్రభావం చూపుతుంది. వాటిని ముందుగా గుర్తిస్తే దేనినైనా నయం చేసుకోవచ్చు...ప్రభుత్వం హాస్పిటల్ కూడా పరీక్షలు చేస్తున్నారు. మందులు ఇస్తున్నారు. అవగాహన కార్యక్రమాలు కూడా పెంచారు.



నాన్ వైరల్ హెపటైటిస్ మూడు రకాలు హాల్కాల్ హెపటైటిస్, ఆటోఇమ్యూన్,డ్రగ్‌ఇంజూరి హెపటైటిస్ మూడు రకాలుంటాయి. ఆల్కాహాల్ తాగే వాళ్లందరితో ఇది రాదు. జనటిక్ వల్ల కూడా రావచ్చు. ఈ మధ్య కాలంలో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో 80 శాతం ఆల్కాహాల్ తీసుకునే వారు పెరిగారు. కూడా ఆల్కాహాల్ తీసుకునే వారెక్కువయ్యారు. విందులు, వినోదాల పేరుతో తరుచూ మద్యం తాగే వారున్నారు. దీంతో చాలా మందికి వస్తుంది. ఫాటీ లివర్ స్టేజిలో ఆల్కాహాల్ తాగడం ఆపేస్తే కూడా నయం కావచ్చు. ఫాటీలివర్ నుంచి కూడా హెపటైటిస్ రావచ్చు. జాగ్రత్తలు తీసుకోక పోతే దీనికి లివర్ క్యాన్సర్ స్టేజీకి రావచ్చు. లవర్ సిరోసిస్ అంటే హెపటైటిస్ ముదిరితే లివర్ పాడవుతుంది. దీనికి లివర్ ట్రాన్స్‌ప్లాటేషన్ ద్వారా నయం కావచ్చు.సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి కూడా లివర్‌ట్రాన్స్‌ఫ్లాంటేషన్‌కు అవకాశాలు కూడా ఉన్నాయి. ఎవరైనా ఆరోగ్యంగా ఉండే వాళ్లు కొంత లివర్ ఇచ్చి కూడా రోగికి నయం చేయవచ్చు. హెపటైటిస్ బి వ్యాక్సిన్ వచ్చింది. ఒక కుటుంబంలో హెపటైటిస్ బి. వస్తు అందరికీ పరీక్షించి వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుంది. వ్యాక్సిన్ మూడు డోసులు ఇస్తారు. ఉపయోగించుకోవాలి. మందులు కూడా వచ్చాయి. వాటితో నయం చేసుకోవచ్చు. హెపటైటిస్ పరీక్షలు వైద్యులను సంప్రదించి చేయించుకోవాలి. జాగ్రత్తలు తీసుకోవాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చేపలు, పౌష్టికాహారం, స్వచ్ఛమైన నీరు తీసుకుని నయం చేసుకోవాలి. వ్యాయామంతో బరువు తగ్గించుకోవాలి. కాపీ తాగడం కూడా హెపటైటిస్ కు మంచిది. ఎవరి ఆరోగ్యాన్ని వారు కాపాడుకోవాలి.



ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న ఎపిడికెఎస్ నాయకులు , కళాకారులు

డప్పు కళాకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

పెన్షన్ ఆన్ లైన్ విడుదల చేయాలి

ఎపిడికెఎస్ జిల్లాకార్యదర్శి బి.కరుణాకర్, మండల గౌరవ అధ్యక్షుడు జె.మోహన్


ప్రజాశక్తి-గూడూరు

డప్పు కళాకారుల సమస్యలు వెంటనే పరిష్కరించి, డప్పు కళాకారుల పెన్షన్ ఆన్‌లైన్ ను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్, మండల గౌరవ అధ్యక్షులు జె.మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలోని సిఐటియు మండల కార్యాలయంలో డప్పు కళాకారుల సమావేశం సంఘం మండల కార్యదర్శి బూడిదిపాడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్నా నేటికి డప్పు కళాకారుల పెన్షన్ ఆన్ లైన్‌ను విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. పెన్షన్ నమోదు వయసును 45 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. తరతరాలుగా అంటరానితనాన్ని, అవమానాన్ని భరిస్తూ సమాజమంతటికి ఉపయోగపడే సాంప్రదాయకళ గా ఉన్న డప్పు కళ పెన్షన్‌ను రూ.7 వేలకు పెంచాలన్నారు. మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. అర్హులైన ప్రతి డప్పు కళాకారునికి డప్పు, గజ్జలు, డ్రస్సు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. డప్పు కళాకారులకు ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, బస్సు ప్రయాణాల్లో రాయతీలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్చార్జి ఎంపిడిఒ మధులత కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఆమె స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారదిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మరో దఫా ఆగస్టు 5న జరిగే మండల డప్పు కళాకారుల జనరల్‌బాడీ సమావేశానికి డప్పు కళాకారులంతా అత్యధిక సంఖ్యలో పాల్గొని డిమాండ్ల సాధనలో భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో డప్పు కళాకారుల సంఘం మండల నాయకులు భగవంతు, గూడూరు ఏసేపు, తిమ్మప్ప, గుడిపాడు నాగరాజు, వెంకటేశ్వర్లు, సనగండ్ల శేషన్న, బుడ్డన్న, రత్నమయ్య, జూలకల్లు ప్రభుదాసు, ప్రకాశం, బూడిదపాడు సురేష్, గుడిపాడు సుధాకర్ ,కళాకారులు పాల్గొన్నారు.

ఎస్‌సి హాస్టల్ ను ఎఎస్‌డబ్ల్యుఒ తనిఖీ

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ లోని ఎస్‌సి హాస్టల్‌ను ఎఎస్ డబ్ల్యుఒ లీలావతి సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటా వార్పును, చుట్టూ పరిసరాలను పరి శీలించి విద్యార్థులతో ముచ్చ టించారు. బాల్య దశలో నుండి కౌమారదశలో క్రమశిక్షణతో పాటు క్రీడలో విద్యలో రాణించాలని సూచించారు. హాస్టల్‌లో గదులను శుభ్రంగా ఉంచాలని మెలకువలు పాటించాలని, నాణ్యమైన వంటలు అందించాలని అన్నారు. అనంతరం పెట్టెలు, రగ్గులు, ప్లేట్లు, గ్లాసులు వంటివి కొరత లేకుండా చూడాలని సంబందించిన హాస్టల్ వార్డన్ భాస్కర్, సిబ్బందికి కోరారు.



మాట్లాడుతున్న ఎఎస్‌డబ్ల్యుఒ లీలావతి

పండ్ల మొక్కలపై ఆసక్తి చూపాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆస్పరి



రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ గీతా వాణి

రైతులు పండ్ల మొక్కల పెంపకంపై ఆసక్తి చూపాలని ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. సోమవారం హార్టికల్చర్ ద్వారా వచ్చిన 9,680 పండ్ల మొక్కలను ఆస్పరితో పాటు శంకరబండ, చిరుమాన్ దొడ్డి, చిగిలి, బిణిగేరి, నగరూరు, ములుగుందం, బనవనూరు, కారుమంచి, కైరుప్పల, ముత్తుకూరు, యటకల్లు, జొహరాపురం, తొగలగల్లు గ్రామాల రైతులకు ఎంపిడిఒ గీతావాణి, ఏపీడీ పక్కీరప్పలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొక్కలు తీసుకున్న ప్రతి రైతూ మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పోసి మూడేళ్ల పాటు వాటి సంరక్షణ చూసుకుంటే తర్వాత మంచి దిగుబడి వస్తుందన్నారు. రైతులకు కావాల్సిన కొబ్బరి, జామ, దానిమ్మ, సపోటా, మామిడి, డ్రాగన్ ఫ్రూట్, స్వీట్ ఆరంజ్, నిమ్మ పండ్ల మొక్కలు ప్రభుత్వం అందిస్తుందని, రైతులు ముందుకొచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్న కారు రైతులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఏపీవో రామకృష్ణ, జూనియర్ ఇంజినీర్ అసిస్టెంట్ మారెన్న, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రభాకర్, షేకన్న, కౌలుట్లయ్య పాల్గొన్నారు.

'రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలి'



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ప్రజలకు చేరువగా ఉంటున్న సచివాలయాల్లో రెగ్యులర్ ఉద్యోగుల్లేక, సేవలందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీల్లో నియామకాలు చేపట్టాలని సిపిఎం పట్టణ నాయకులు కోరారు. సోమవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణకు సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వెంకటేష్, వీరేష్, కృష్ణమూర్తి, నాగరాజు, వెంకటేశులు, శ్రీనివాసులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో ఉన్న సచివాలయాల్లో ఇటీవల జరిగిన బదిలీల్లో ఎక్కువ భాగంగా వేరే ప్రాంతాలకు వెళ్లారని తెలిపారు. ఇన్‌ఛార్జిలతో సచివాలయాల్లో సక్రమంగా సేవలందడం లేదని చెప్పారు. కొన్ని సచివాలయాల్లో కేవలం ముగ్గురు, నలుగురు మాత్రమే ఉద్యోగులు ఉంటున్నారని తెలిపారు. విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఇవ్వడంలో, కొత్త రేషన్ కార్డులు, కార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పులు చేయించుకోవడంలో, ప్రభుత్వం పేదలకు ఇస్తామంటున్న ఇంటి స్థలాల అర్జీలను విచారించి ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యం ఉందని తెలిపారు. అన్ని సచివాలయాలకు రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి... వారం చివరిలోపు పూర్తిస్థాయిలో సచివాలయ ఉద్యోగులను నియమిస్తామని హామీఇచ్చారు.

5న స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఆదోని

స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని బోయగేరి, మరాఠీ వీధిలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, నాయకులు లక్ష్మణ్ మాట్లాడారు. ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ప్రజలకు గుదిబండగా మారుతున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. ఎఐటియుసి పట్టణ అధ్యక్షులు, కార్యదర్శి భీమేష్, ఎంకన్న, సుదర్శన్, ఐఎఫ్‌టియు నాయకులు నాగరాజు, పిడిఎస్‌యు నాయకులు సోమశేఖర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నాయకులు

ఆర్భాటానికి రూపాలు.. ఆధునిక దిష్టిబొమ్మలు

- రైతులకు ఉపయోగపడని యంత్రాలు - రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు
- సచివాలయాల్లో మూలనపడ్డ యంత్రాలు

ప్రజాశక్తి - ఆస్పరి

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, అవసరమైన సేవలను అందించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసింది. వీటికి రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేశారు. వీటిని ఎలా ఉపయోగించాలనే దానిపై ఎవరికీ, ఎలాంటి అవగాహనా కల్పించలేదు. కియోస్క్ యంత్రాలు ఆధునిక దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయి.



సచివాలయంలోని ఓ గదిలో మూలన పడిన యంత్రం

ఆస్పరి మండలానికి 20 కియోస్క్ యంత్రాలు పంపిణీ చేశారు. ఒక్కో యంత్రం సుమారు రూ.లక్ష దాకా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను వీటి ద్వారా బుకింగ్ చేస్తారు. పశుసంవర్ధక శాఖ ద్వారా దాణా, మినరల్ మిక్చర్, మందులు కూడా వీటితోనే బుకింగ్ చేసుకోవచ్చు. ఉద్యానశాఖ ద్వారా విత్తనాలు బుకింగ్ చేసుకోవచ్చు. రైతులకు ఈ యంత్రాలు ఉపయోగం పడిన దాఖలాలు లేవు. వచ్చిన యంత్రాలు వచ్చినట్టే కొన్ని చోట్ల రైతుసేవా కేంద్రాల్లో, మరి కొన్నిచోట్ల గ్రామ సచివాలయంలోనే వృథాగా పడి ఉన్నాయి. వీటిపై అవగాహన లేకపోవడంతో సెల్‌ఫోన్‌లోనే ఆయా శాఖలకు సంబంధించిన సిబ్బంది పనులు చేసుకుంటున్నారు. కియోస్క్ యంత్రాల స్థానంలో కంప్యూటర్, ట్యాబ్‌లు అందిస్తే రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు.

రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు

- రంగస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి, ఆస్పరి



గత ప్రభుత్వం హయాంలో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన కియోస్క్ యంత్రాలు రైతులకు ఎలాంటి ఉపయోగమూ పడక పోగా సచివాలయాల్లోని గదులకు పరిమితమయ్యాయి. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు, నీళ్ల మందులు అందుబాటులో లేవు. అధికారులు స్పందించి రైతులకు ఆర్‌ఎస్‌కెలలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

యంత్రాలను వినియోగంలోకి తీసుకొస్తాం

- నరేంద్ర కుమార్, ఎఒ, ఆస్పరి.



ప్రతి ఆర్‌ఎస్‌కెలో ఉన్న కియోస్క్ యంత్రాలపై సిబ్బందికి అవగాహన కల్పించి వినియోగంలోకి తీసుకొస్తాం. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

బిల్లులు రాక కాంట్రాక్టర్ల గగ్గోలు

- 39 సిసి రోడ్లకు రూ.2.30 కోట్ల బకాయిలు

ప్రజాశక్తి - మంత్రాలయం

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం ద్వారా అట్టహాసంగా చేపట్టిన సిసి రోడ్లకు ఇంత వరకు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కావడం లేదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. వైసిపి ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులు చేసి రూ.కోట్లు అప్పులు తెచ్చి సిసి రోడ్లు, భవనాల నిర్మాణాలు, ఇతర నిర్మాణ, అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు చేపట్టారు. వారికి బిల్లులు మంజూరు చేయకుండా ఉండడం వల్ల కాంట్రాక్టర్లు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆస్తులు అమ్ముకొనే పరిస్థితి నెలకొంది. నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్టర్లకు చుక్కలు చూపించడతో కాంట్రాక్టు పనులు అంటే భయపడే దుస్థితి ఏర్పడింది. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లకు విడతల వారీగా బిల్లులు మంజూరు చేసి వారికి ఊపిరి పోశారు. గతేడాది డిసెంబర్ మొదటి వారంలో టిడిపి ప్రభుత్వంలో సిసి రోడ్ల ఏర్పాటుకు టెండర్లు లేకుండా కాంట్రాక్ట్ పనులు అప్పగించారు. మండలంలో మొత్తం 39 సిసి రోడ్లను కాంట్రాక్టర్లు పూర్తి చేసి బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. మొత్తం ప్రభుత్వం నుంచి రూ.2.30 కోట్లు రావాల్సి ఉంది. మండలంలో మొత్తం ఆరుగురు కాంట్రాక్టర్ల ద్వారా మంత్రాలయంలో 5 సిసి రోడ్లు, మాధవరంలో 4, చిలకలడోణలో 3, సూగూరులో 2, మాలపల్లిలో 2, వగరూరులో 2, కలుదేవకుంటలో 2, సుంకేశ్వరిలో 2, రచ్చుమర్రిలో 2, చెట్నీహళ్లిలో 1, మాధవరం తండాలో 1, సింగరాజన్నహళ్లిలో 1, పరమాన్ దొడ్డిలో 1, తిమ్మాపురంలో 1, సౌలహళ్లిలో 1, రాంపురంలో 1, కాచాపురంలో 1 పూర్తయ్యాయి. గత 6 నెలలుగా కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఎఇ మల్లయ్యను వివరణ కోరగా... బిల్లులు త్వరలో మంజూరవుతాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.



ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్
- ఎస్‌ఎఫ్‌ఐ 44వ జిల్లా ప్లీనరీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎస్‌ఎఫ్‌ఐ కృషి చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, రాష్ట్ర మాజీ నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ 44వ జిల్లా ప్లీనరీ సమావేశాలు పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ద్వారా దేశవ్యాప్తంగా పాఠశాలలను కాషాయీకరణ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులను ప్రభుత్వ కార్యక్రమాలకు, విద్యాసంస్థలకు ముఖ్య అతిథులుగా పంపుతూ విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే విధానాలను అవలంభిస్తున్నారని మండిపడ్డారు. గత కొన్నేళ్లుగా పరిశోధన, ప్రభుత్వ ప్రాజెక్టుల ద్వారా ఈ పథకాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ నాయకులు ఆనంద్ బాబు



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

విలువల పెంపు కార్యక్రమం పేరుతో విశ్వవిద్యాలయాల్లో మూఢనమ్మకాలకోస్థానం కల్పిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక విద్యా విధానంలో సంపూర్ణ మార్పులు తెస్తామంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రచారం చేశారని, విద్యార్థులతో ముఖాముఖిలో ఎన్నో వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. వాటిని నెరవేర్చడంలో విఫలం చెందారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీని 27 మందితో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సాయి ఉదయ్, జిల్లా కార్యదర్శిగా రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, విజయ్, అమర్, అంజి, సంయుక్త, జిల్లా సహాయ కార్యదర్శులుగా రంజిత్ రెడ్డి, శశి కుమార్, అబుబాకర్, లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ... భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా రంగ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, ఈ ఉద్యమంలో ప్రతి విద్యార్థి పాల్గొనిహక్కులను సాధించుకోవాలని కోరారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా బీటీ

ప్రజాశక్తి - ఆదోని



ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ.నాయుడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర లెజిస్లేచర్ జనరల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ సూర్యదేవర నియామక ఉత్తర్వులను విడుదల చేశారని సోమవారం బీటీ.నాయుడు తెలిపారు. శాసనసభ సభ్యుల అధికారాలు, హక్కులకు సంబంధించిన అంశాలను పరిశీలించి, తగిన సిఫార్సులు చేయడంలో ప్రివిలేజ్ కమిటీ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. అనుభవం, శాసనపరమైన పరిజ్ఞానం కమిటీ పనితీరును మరింత బలోపేతం చేయనుందని బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ బీటీకి పదవులు ఇవ్వడంపై టిడిపి జిల్లా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, బీటీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఇఒ గోవిందు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నందవరం



నందవరం ఎంఇఒగా డి.గోవిందు సోమవారం ఎంఇఒ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎంఇఒగా ప్రభుత్వం నియమించిందని చెప్పారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణ, విద్య రావాలంటే ఉపాధ్యాయులు పాత్ర కీలకమైందని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలను అందేలా చూస్తానని తెలిపారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలయ్యేలా చూస్తానని చెప్పారు. బడి బయట ఉన్న పిల్లలను స్కూల్‌లో చేర్పించడానికి శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.

రసీదు ప్రకారమే ఆధార్, ఇంటి నెంబర్

- పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



పంచాయతీకి కట్టిన ఇంటి పన్ను రసీదులో వేసిన ఇంటి నెంబర్‌నే ఆధార్ కార్డులో ఉండే విధంగా చూసుకోవాలని మేజర్ పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. గ్రామస్తులు పంచాయతీకి ఇంటి, నీటి పన్ను కట్టినప్పుడు పంచాయతీ అధికారులు ఇచ్చిన రసీదులో ఇంటి నెంబర్‌ను ధ్రువీకరించి అందులో వేసి ఇస్తారన్నారు. దాని ఆధారంగానే ఆధార్ కార్డులో నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకపోతే కొన్ని చట్టం, న్యాయపరమైన సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డులను పరిశీలించి ఆధార్ కార్డులో తప్పుగా నమోదు చేసి ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడే స్పందించకుండా ఇలాంటి ఇంటి నెంబర్లు, చిరునామాలు, మొబైల్ నెంబర్లను సరిచేసుకోవాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం..!

- కనిపించని పరిశుభ్రత

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని గజ్జహల్లి గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. మురుగునీరు నిలిచి ఉండడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినకుండా ముందు జాగ్రత్త చర్యగా పారిశుధ్యంపై దష్టి పెట్టాలని రాష్ట్ర జిల్లాస్థాయి అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని గజ్జహల్లి గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్యం పడకేసింది. ప్రధాన జనసంచార పోతులూరింగేశ్వర దేవాలయం ముందు మురుగు నీరు నిల్వ ఉండడంతో అపరిశుభ్రత కారణంగా పందులు తిరుగుతున్నాయి. చిన్నారులు సైతం ఆ రోడ్డుపై ప్రయాణిస్తారు. ఏదైనా రోగాల బారిన పడవచ్చు తెలిసినా పంచాయతీ కార్యదర్శి, సర్పంచి మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేసి ప్రజల ప్రాణాలను కాపాడే ఆలోచన రాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం. 7 వేల జనాభా కలిగిన గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ, సిసి రోడ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వర్షాకాలంలో గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే ఎక్కువమంది రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. రోజువారీ కూలి పనులతో వచ్చిన డబ్బును సైతం ఆదోని, బళ్లారి వంటి ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ వైద్యశాలలో తమను పట్టించుకోరని గ్రామస్తులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతం

బుక్ కీపర్ తొలగింపుపై కన్నెర్ర

- సంఘీభావం తెలిపిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏ కారణమూ లేకుండా పొదుపు బుక్ కీపర్లను, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం పట్ల మహిళలు కన్నెర్ర చేశారు. మండలంలోని గణేకల్లు గ్రామంలో ఎలాంటి ఆరోపణలూ రాకుండా 18 ఏళ్లుగా విధులు నిర్వహించిన బుక్ కీపర్ నాగవేణిని తొలగించడంతో గ్రామ పొదుపు మహిళలు అధికారులపై కన్నెర్ర చేశారు. రాజకీయ నాయకుల మాటలకు తలొగ్గి ఎలా తొలగిస్తారంటూ ఎపిఎం వీరన్న, సిసి రవిని నిలదీశారు. బుక్ కీపర్‌గా నాగవేణిని కొనసాగించాలని సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారి నిరసనకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి లింగన్న, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దశాబ్ద కాలంగా బుక్ కీపర్లుగా కొనసాగుతున్న మహిళలను ఏ కారణం లేకుండానే కూటమి నాయకులు తొలగిస్తూ ఉపాధి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. తొలగించాలంటే గ్రామైక్య సంఘం తీర్మానం అవసరమన్నారు. అడ్డదారుల్లో మహిళలతో సంతకాలు చేయించుకొని ఉన్నతాధికారులకు పంపి నాగవేణిని తొలగించడం సమంజసం కాదన్నారు. నాగవేణికి న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి వసుంధర మాట్లాడుతూ... గ్రామంలో విచారణ చేయించి నాగవేణికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎంపిటిసి లక్ష్మి, గ్రామైక్య సంఘం నాయకులు హనుమక్క, బంగారమ్మ, దేవమ్మ, తులసమ్మ పాల్గొన్నారు.



ఎపిఎం వీరన్నతో వాగ్వాదానికి దిగిన పొదుపు మహిళలు

ఉరుకుంద క్షేత్రంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - కౌతాళం



ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు



ఎల్‌ఎల్‌సిలో భక్తుల స్నానాలు

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్ర రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుణ్యక్షేత్రం పరిసరాలు ఉరుకుంద ఈరన్న స్వామి నామస్మరణతో మార్మోగాయి. ఆదివారం రాత్రి భక్తులు క్షేత్రానికి చేరుకోవడంతో సోమవారం తెల్లవారుజామున నుంచి స్వామి వారి దర్శన సౌకర్యాలు కల్పించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఈ ఏడాది ఫుట్ బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో భక్తులకు దర్శనాలు ఆనందభరితంగా సాగాయి. ఈరన్న స్వామి భక్తులు తుంగభద్ర దిగువ కాలువలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారికి ఇష్టమైన నైవేద్యాన్ని వండి పూజలు చేశారు. దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. తాగునీటి సౌకర్యం, నిత్యాన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

రెండో అన్నదాన కేంద్రం ప్రారంభం

శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో భక్తుల కోసం నూతనంగా నిర్మించిన రెండో అన్నదాన సత్రాన్ని డిప్యూటీ కమిషనర్ విజయరాజు ప్రారంభించారు. అలాగే మహిళల కోసం నిర్మించిన మరుగుదొడ్లను కూడా ప్రారంభించారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్ హయాంలో దివాలా తీసిన రాష్ట్రం


- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న ఉమాపతి నాయుడు

పాలన పట్ల అవగాహన లేని మాజీ ముఖ్యమంత్రి జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు విమర్శించారు. సోమవారం పట్టణంలోని 3వ వార్డు గౌలిపేట్, చిన్న శక్తి గుడి ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. నాయకులు సాకరే మారుతీరావు, శ్రీకాంత్ రెడ్డి, రంగస్వామి నాయుడు, బసవరాజు, గుడిసె శ్రీరాములు, శంకర్, రామస్వామి, ఉమ్మి సలీం, రంగన్న, అప్సర్ బాష, నీలకంఠప్ప, లక్ష్మీనారాయణ, అల్తాఫ్, బినిగిరి తిమ్మప్ప, రవి, మహేష్, సాధికా బేగం, కృష్ణారెడ్డి, బాబులు, అంజి, తాయన్న, వెంకన్న, ఈరన్న, శివ, గిడ్డయ్య, నాగరాజ్ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలం కామినహల్ గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. కామినహల్ రమేష్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మల్లికార్జున పాల్గొన్నారు.




హాలహర్విలో...

రోడ్ల విస్తరణ చేపట్టాలి

- ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రోడ్ల వెడల్పు తప్పనిసరి అని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. సోమవారం పట్టణ శివారులో జరుగుతున్న హైవే పనులను పరిశీలించారు.



మాట్లాడుతున్న నూర్ అహ్మద్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత జాతీయ రహదారి 167 బైపాస్ పూర్తి కావడం వల్ల కేవలం భారీ వాహనాలు, మెయిన్ రోడ్డు నుంచి వెళ్లే వాహనాలు మాత్రమే ఆదోని బయట నుంచి వెళ్తాయని తెలిపారు. ఆదోనిలో రద్దీ ప్రాంతాలైన మార్కెట్, షాపింగ్ రోడ్లు అన్నీ రద్దీగానే ఉంటాయన్నారు. అక్కడ ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి రోడ్ల విస్తరణ మాత్రమే మార్గమని, ఎమ్మెల్యే ఆ దిశగా చొరవ చూపాలని కోరారు. సలహాదారులు నరేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

నదీతీరంలో అప్రమత్తంగా ఉండాలి

- తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదీతీరంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని తుంగభద్ర నదీ ప్రవాహక గ్రామాలైన మేలిగనూర్, నదిచాగి, కుంభాలనూరు, మరలి, గుడికంబాలి, వల్లూరులో పర్యటించి ప్రజలకు తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం 90 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని, ఈ ప్రవాహం పెరగవచ్చు.. తగ్గవచ్చని తెలిపారు. ప్రజలు నది నీటి ప్రవాహం వైపు వెళ్లరాదన్నారు. చేపల కోసం, వ్యవసాయ పనుల కోసం తుంగభద్ర నది దాటడానికి ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. **మంత్రాలయం** వద్ద తుంగభద్ర నది ప్రవాహాన్ని తహశీల్దార్ కె.రమాదేవి, ఎస్ఐ శివాంజల్ పరిశీలించారు. శ్రీరాఘవేంద్ర స్వామి మఠం వెనక ఉన్న తుంగభద్ర నది ఘాట్ వద్ద కట్టిన బారికేడ్లను పరిశీలించారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు, భక్తులు, జాలర్లు, పుట్టి నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయించారు. హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, విఆర్ఒ భీమయ్య ఉన్నారు. **కోసిగి** మండలం అగసనూరు, కందుకూరు గ్రామ సమీపంలో ఉన్న రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్‌డిఎస్) వద్ద తహశీల్దార్ వేణుగోపాల్, ఇరిగేషన్ ఎఇ రాంప్రసాద్, ఎస్ఐ హనుమంత రెడ్డిలు సిబ్బందితో కలిసి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ... నదీతీర గ్రామాలు అగసనూరు, కందుకూరు, సాతనూరు, తుంబిగనూరు, కడిదొడ్డి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. నదీ పక్కన ఉన్న రైతులు ప్రత్యేకించి అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీ ప్రవాహంపై రోజురోజు సమాచారం ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.



కోసిగిలో నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుంగభద్రపై సమాంతర కాలువ నిర్మించాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం



వరద నీటిని పరిశీలిస్తున్న నాయకులు

తుంగభద్ర నదిపై సమాంతర (వరద) కాలువను నిర్మించి జిల్లాలోని పశ్చిమ ప్రాంత రైతులకు నీటిని అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మేలిగనూరు గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతేడాది వర్షాకాలంలో తుంగభద్ర వరద జలాలు సుమారు 100 టిఎంసిలు సముద్రం పాలవుతున్నాయని తెలిపారు. ఈ జలాలు వృథా కాకుండా జిల్లాలోని పశ్చిమ ప్రాంత రైతులకు అందించి వలసలు నివారించాలని కోరారు. రిటైర్డ్ ఇంజినీర్ సుబ్బరాయుడు డిజైన్ చేసిన ప్రకారం సమాంతర కాలువ నిర్మాణం చేపడితే జిల్లాలోని మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు వరకు వరద నీటిని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కూటమి ప్రభుత్వం సమాంతర కాలువ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, ఉల్లిగయ్య, వలీ పాల్గొన్నారు.

ఆర్‌పిల పెండింగ్ వేతానాలివ్వాలి

ప్రజాశక్తి-గూడూరు

ఆర్‌పిల పెండింగ్ వేతానాలివ్వాలి ఇవ్వాలని, అదనపు పనులు అప్ప చెప్పకూడదని గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని, గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో మెప్మా ఆర్‌పిలు టిఎంసి రాములు వినతిపత్రం ఇచ్చారు. మెప్మా రిసోర్స్ పర్సన్స్,ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, సిఐటియు డివిజన్ కార్యదర్శి జె. మోహన్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు యశోద, భారతి,లు మాట్లాడుతూ ఆర్‌పిల జీతాలు ఐదు నెలలుగా పెండింగులో ఉన్నాయని, జీతాలు లేక ఆర్‌పిలు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు విడుదల చేసి ఆర్‌పిలను ఆదుకోవాలన్నారు. ఆర్పీల వేతనాల కొరకు రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించి నెలనెల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మెప్మా ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఆర్పీలకు అదనపు పనుల భారం ఎక్కువైందని, అదనపు పని భారాన్ని వెంటనే తగ్గించాలన్నారు. ఆర్పీలకు టిఏలుగా గుర్తింపు ఇచ్చి, గ్రేడింగ్ విధానం రద్దు చేయాలన్నారు. అర్హత కలిగిన ఆర్పీలను సిఒ, డిఒగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఆర్పీల వేతనం వారి వ్యక్తిగత అకౌంట్లో జమ చేయాలని, ఆర్పిలకు కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. ఆర్పీల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గూడూరు మెప్మా ఆర్పీలు పార్వతి, రేష్మ, నాగలక్ష్మి, శిరీష, లింగేశ్వరి, ప్రభావతి, ఫరీదా, మల్లీశ్వరి, షమీం, కళావతి, పద్మావతి, రామాంజనమ్మ తదితర ఆర్పి లు పాల్గొన్నారు.


ఆర్‌పిలకు వేతనాలివాలని అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు, ఆర్‌పిల నేతలు

ఆర్‌టిసి స్థలాల రక్షణకు పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసి విలువైన స్థలాలను ప్రియివేటు వారికి అప్పగించే ప్రయత్నం చేస్తుందని వాటిని కాపాడుకోవడం కోసం ఉద్యోగులు, ప్రజలు పోరాడవలసిన అవసరం ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు అన్నారు. ఆర్‌టిసి విలువైన స్థలాలను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కర్నూలు -1, కర్నూలు -2 డిపోల దగ్గర సోమవారం ఆందోళన చేపట్టారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజనల్ కార్యదర్శ కెసి శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.డి అంజిబాబు ఎస్ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు విఎస్.రాయుడు మాట్లాడుతూ ఆర్‌టిసి సంబంధించిన విలువైన స్థలాలను ప్రవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విజయవాడ నడిబొడ్డు రూ.వేలకోట్ల విలువచేసే గవర్నర్‌పేట 2 డిపో స్థలాన్ని లూలూ అనేబహుళ జాతి సంస్థకి అప్పజేస్తారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య అని దీన్ని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ చేయడం కోసం అనే పేరుతో ప్రవేట్ సంస్థలకు స్థలాలను అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నడపాలని ఆర్‌టిసి పని చేస్తున్న ఉద్యోగుల ద్వారానే బస్సులను నడిపించాలని డిమాండ్ చేశారు. 20వేల ఎకరాలు ఆర్‌టిసి సంస్థకు చెందినవి నగర ప్రాంతాలలో ఉన్నాయని లక్షల కోట్ల విలువ చేసే ఈ స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంత్ రెడ్డి కర్నూలు-1 డిపో కార్యదర్శి నాగరాజు కర్నూలు-2 డిపో కార్యదర్శి సి.బజారి రీజనల్ నాయకులు దేవరాజు మునెప్ప, డ్రైవర్ శేఖర్, మద్దిలేటి, జానకి రాముడు, ఎస్‌ఆర్‌కె.రెడ్డి, హుసేని, శేషన్న, ఆటో వర్కర్స్ యూనియన్ న్యూ సిటీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వలి, రాధాకృష్ణ, మళ్లీతదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి స్థలాల రక్షణకు ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్; సిఐటియు నాయకులు

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

శిధిలావస్థకు చేరుకున్నపాత ఫోల్స్ స్థానంలో కొత్తవి అమర్చాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో కరెంటు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి శిధిలావస్థకు చేరుకున్న పాత కరెంటు పోల్స్ స్థానంలో కొత్త ఫోల్సును వేయాలని కోరుతూ సిపిఎం23వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో బి క్యాంప్ కరెంటు ఎఇ రాఘవేంద్ర ప్రసాద్ కు కాలనీ ప్రజలతో కలిసి సంతకాలతో కూడినవినతి పత్రం ఇచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు ఎలక్ట్రికల్ ఎఇకి సమస్యను వివరించారు. శ్రీరామనగర్‌లో 49 /50/ఎ-170 మరియు49/50 ఎ-180 ఇంటి నంబర్లు గల లైన్‌లో లోవోల్టేజ్ సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని తరచూ మాటిమాటికి కరెంటు పోతుందన్నారు. లోవోల్టేజీ కారణంగా ఇంట్లో బల్బులు వెలగడం లేదని, టీవీలు ఫ్రిజ్లు పనిచేయడం లేదని, లైట్లు డిమ్ముగా వెలగడం వలన పిల్లలు చదువుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉందన్నారు. కనుక లో వోల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యుత్ పోల్స్ పాతవి అయినందున ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందన్నారు. ఎఇరాఘవేంద్ర స్పందించికరెంటు లోవోల్టేజి సమస్య లేకుండా చేసి శిథిలావస్థకు చేరుకున్న కరెంటు పోల్స్‌ను తొలగించి కొత్త ఫోల్స్ ను వేస్తామన్నారు. కరెంటు వైర్లు వేలాడుతున్న ప్రాంతంలో కొత్తపోల్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని ప్రమాదాలు జరగకుండా చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీ గ్రౌండ్ కు ఎసరు?

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండ్‌ను అభివృద్ధి పేరుతో భవనాలు నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభివృద్ధి, భవనాల పేరుతో మెడికల్ కాలేజీ గ్రౌండ్ లోని 60 సెంట్ల (సుమారు 60 కోట్లు)స్థలానికి ఎసరు తెచ్చే ప్రయత్నాలు జోరందుకున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఓల్డ్ స్టూడెంట్స్ పేరుతో కొద్దిమంది ఎన్నారై ఫండ్స్ తెచ్చి భవనాలు కట్టి అభివృద్ధి చేస్తామని పేరుతో గ్రౌండ్ లేకుండా చేసే యత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికే అనేకమంది విద్యార్థులు మానసిక ఒత్తిళ్ళతో సతమతమవుతున్న ఈ పరిస్థితుల్లో వారిని శారీరకంగా మానసికంగా ఉపయోగపడే మెడికల్ కాలేజీ గ్రౌండ్ తీసుకోవడం సరైనది కాదని ప్రభుత్వ వైద్యులు, వైద్య విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే మెడికల్ కాలేజీ గ్రౌండ్ అనేక ఆక్రమణలకు గురై కొద్ది స్థలానికి పరిమితమైందని, ఈ స్థలాన్ని కూడా బిల్డింగ్స్, అభివృద్ధి, లాభాపేక్ష పేరుతో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ పేరుతో గ్రౌండ్‌కు ఎసరు తేవడం ఎంతవరకు సబబు పని ప్రశ్నిస్తున్నారు. ఈరోజు వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఓ సమావేశంలో ప్రభుత్వ వైద్యులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో గ్రౌండ్ లేకుండా చేయడం కరెక్ట్ కాదన్నా అభిప్రాయం వ్యక్తం అయినట్లు వినికిడి.

హెడ్ నర్స్ వసంత కుమారి సేవలు అభినందనీయం

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ పి. చంద్రశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెడ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తూ ఈ నెలలో పదవి విరమణ తీసుకుంటున్న వసంతకుమారి సేవలు అభినందనీయమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విసి డాక్టర్ పి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం జిజిహెచ్ లోని కార్డియాలజీ విభాగంలో మొత్తం 38 సర్వీసులో 30 ఏళ్లుగా ఒకే విభాగంలో వసంతకుమారి సేవలందించడం అంటే అభినందించదగ్గ విషయమని అందరికీ అనుకూలంగా డిపార్టుమెంటులో ఏర్పాట్లు , రోగులకు అందాల్సిన సేవల విషయంలో కూడా సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకున్నారని, వీరిసర్వీసులో ఎన్నో వందల మంది వైద్యుల మన్ననలను పొందారని ఆమెను అభినందించారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రశాంత్ డాక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, కార్డియాలజీ టెక్నీషియన్ రమేష్, శివుడు, స్టాఫ్ మంజుల, ఇసిజి టెక్నీషియన్ తిరుమలరాజు తదితరులు పాల్గొన్నారు.


వసంతకుమారిని అభినందిస్తున్న ఎన్‌టిఆర్ హెల్త్ వర్సిటీ విసి డాక్టర్ చంద్రశేఖర్

జిజిహెచ్‌లో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

300 మంది వైద్య విద్యార్థులకు హెపటైటిస్ బి వ్యాక్సిన్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూలై 28న జరుపుకునే ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం, తీవ్రమైన కాలేయ వ్యాధి , క్యాన్సర్‌కు కారణమయ్యే కాలేయం వాపు అయిన వైరల్ హెపటైటిస్ గురించి వైద్యులతో అవగాహన కార్యక్రమన్ని ఓల్డ్ లెక్చరర్‌హాల్ లో గ్యాస్ట్రోఎంటరాలజీ హెచ్‌ఒడి డాక్టర్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఫైనల్ ఇయర్ మెడికల్ విద్యార్థులకు 300 మందికి హెపటైటిస్ బి వ్యాక్సిన్ ఇచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వరు, కెఎంసి ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలోని హెపటైటిస్ రెండవ డోస్ ఒక నెల తర్వాత ఇస్తామని అన్నారు. హెపటైటిస్ అనేది కాలేయానికి సంబంధించిన వ్యాధి ఇది సాధారణంగా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తుందన్నారు. కొన్నిసార్లు ఇతర కారణాలు కూడా ఉండొచ్చని అన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్, డాక్టర్ శ్రీరాములు, ఇన్చార్జి సిఎస్‌ఆర్‌ఎంఒ డాక్టర్ వెంకటరమణ, ఎస్‌పిఎం డిపార్ట్మెంట్ హెచ్‌ఒడి, డాక్టర్ సుధా కుమారి, కెఎంసి వైస్ ప్రిన్సిపల్ సిందియా శుభప్రద, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ శివబాల అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న డాక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెపటైటిస్ బి వ్యాక్సిన్ ఇస్తున్న వైద్యులు ,

10 వార్డు రజక వీధిలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్.

కర్నూలు నగర మున్సిపాలిటీలో ఓల్డ్ సిటీ 10 వార్డు చాకలి వీధిలో ఆరు రోజుల నుండి తాగడానికి మంచినీళ్లు రావడం లేదని, కాళీ బిందెలు తీసుకుని మునిసిపల్ ఆఫీస్ ముందు సోమవారం సిపిఎం తరఫున ధర్నా చేశారు. అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన వహించారు. సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, సిపిఎం కార్యవర్గ సభ్యులు ఎస్‌ఎండి షరీఫ్, రజక సంఘం జిల్లా నాయకులు గురుశేఖర్, జయమ్మలు మాట్లాడుతూ కర్నూలు నగరంలో 23, 24వ తేదీల్లో పైప్‌లైన్ మరమ్మతులు కోసం రెండు రోజులు కర్నూలు నగరానికి మంచినీళ్లు రావని చెప్పారు. మునిసిపల్ అధికారులు పైప్ లైన్ మరమ్మతులో రెండు రోజుల్లో పూర్తి చేశారన్నారు. 10 వార్డు చాకలి వీధిలో 23 నుండి 28వ వరకు అంటే ఆరు రోజులు మంచినీళ్లు సరఫరా చేయలేదు. నగరమంతా తాగడానికినీళ్లు వస్తుంటే 10వ వార్డు చాకలి వీధి, ఖడక్ పురామైదానం కింద ప్రాంతం మంచినీళ్లు రాలేదన్నారు. పైపు లైన్మెన్ అధికారి ఎఇ పాత బస్టాండ్ వాటర్ ట్యాంక్ వాళ్ల దగ్గర పోయి అధికారులకు మంచినీళ్ళు రావని చెబితే కూడా పట్టించుకోలేదన్నారు. ఫోన్ చేస్తే కూడా స్పందించలేదన్నారు. చాకలి వీధి మాత్రం లైన్ మెన్ చాలా సంవత్సరాలు నుండి తక్కువ సమయం నీళ్లు వదులుతున్నారు. తమందికి దొరికి మరి కొంతమందికి దొరకడం లేదన్నారు. చాలా సంవత్సరాల నుండి పైప్ లైన్ అధికారి తాగునీళ్లు వదలడంలో సమయం చాలా తక్కువగా ఇచ్చారన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి చాకలి వీధిలో మంచినీళ్లు సౌకర్యం కల్పించాలని రోజు అందరికీ నీళ్లు దొరికే వరకు పైప్లైన్ అధికారి తాగడానికి నీళ్లు ఇవ్వాలని కోరారు. సిపిఎం ,నగర నాయకులు ఖాజా పాషా, మాబుసా, చాంద్ భాషా, గోరేభాయ్, మహమ్మద మూసా అబ్దుల్లా ,ఫకీరమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్

బస్సులు నడుపుటకు డ్రైవర్లు కావలెను

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కర్నూలు డిపోలో బస్సులు నడుపుటకు పాన్ కార్డ్ డ్రైవర్లుగా విధులు నిర్వహించడానికి అర్హులైన భారీ వాహనాల నడుపు డ్రైవర్ లైసెన్స్ కలిగి కనీసం రెండు సంవత్సరాల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు వన్ డిపో మేనేజర్ కె.సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం ఎస్‌ఆర్ వలి సెల్‌నంబర్ 9985181304, జివి. ఆంజనేయులు 9949 202923 లకు సంప్రదించాలన్నారు.



జెసిని కలిసిన నగరపాలక కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా జాయింట్ కలెక్టర్ పి.నవ్యను సోమవారం కలెక్టరేట్‌లోని జెసి చాంబర్‌లో నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

హైకోర్టు ఆదేశాలతోనే నియామకం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రా ర్ గా ఎల్‌వి సుబ్బారెడ్డి కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాన్ని హైకోర్టు ఇచ్చిన ఆదేశానుసారం నియామకం చేపట్టారని వర్సిటీ రిజిస్ట్రా ర్ బి. విజయకుమార్ నాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఎలాంటి అరియర్స్ మాత్రం యూనివర్సిటీ చెల్లించలేదని పేర్కొన్నారు.

హజ్ యాత్రకు 31లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - నంద్యాల : 2026 హజ్ యాత్రకు వెళ్లాలనుకునే నంద్యాల జిల్లా ముస్లింలు నేషనల్ డిగ్రీ కళాశాలలో ఉన్న హజ్ సేవా కేంద్రంలో ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులను సమర్పించుకోవాలని జిల్లా హజ్ సేవా సమితి అధ్యక్షులు యస్.ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం నేషనల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిస్టింగ్ సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకునే చివరి తేదిని పొడిగించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో హాఫిజ్ అంజాద్ బాషా సిద్ధిక్, మౌలానా మొహమ్మద్ రఫీ, హాఫిజ్ అబ్దుల్ హాది, మౌలానా మహబూబ్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ ప్రతినిధి మొహమ్మద్ తస్లీమ్, హాఫిజ్ ఎం. డి. షరీఫ్.హజ్‌యాత్ర విశిష్టతను వివరించారు. హాఫిజ్ షబ్బీర్ అహ్మద్, రఫీపాల్గొన్నారు.

ఉప కారగారాన్ని జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని ఉపకారాగారాన్ని సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ముద్దాయిలకు న్యాయ సేవలను గురించి వివరించారు. అనంతరం ఖైదీలకు భోజన వసతి సౌకర్యాలను గురించి ఆరా తీశారు. ఏదైనా న్యాయపరమైన సమస్యలుంటే కారాగారంలోని న్యాయ సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అందరికీ న్యాయవాదులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకోలేని ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఏదైనా ఫిర్యాదులు ఉంటే ఆన్లైన్ నంబర్ 15100 ద్వారా తెలియజేయవచ్చన్నారు. అనంతరం జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డితో జైలులోని సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ వెంకటేశ్వర్లు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం

వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మాజీ ఎమ్మెల్యే కర్నూలు జిల్లా వైసిపి అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మాజీ అధ్యక్షురాలు విజయ మనోజ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎస్‌వి. మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు కల్లబొల్లి మాటలు మీ భవిష్యత్తుకు నేను గ్యారెంటీ అని చెప్పి చివరకు వారికి మోసం మాత్రం తప్పక చేస్తానని మరొకసారి చంద్రబాబు నాయుడు నిరూపించుకున్నారని విమర్శించారు. ప్రజా క్షేత్రంలో ఎవరైనా సరే ప్రజలకు సేవ చేయాలని తపన పడతారని , కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు మోసం చేస్తుందని ఆయన విమర్శించారు. ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజా సంక్షేమం కొరకు వైసిపి ముందుంటుందని ఆయన తెలిపారు. ఎస్‌వి విజయ మనోహరి మాట్లాడుతూ ఆడబిడ్డలకు ప్రతి ఒక్కరికి రూ.1500 చెల్లిస్తానన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తానని చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు వాగ్దానం చేసి ఇప్పుడు వాటిని పక్కన పెడుతున్నాడని ఇది చాలా దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు మున్నియమ, రాజేశ్వర్‌రెడ్డి, శకమద్, కృష్ణకాంత్, వాసు, సీనియర్ నాయకులు, అనుబంధ విభాగం అధ్యక్షులు వార్డు ఇన్‌ఛార్జులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు


వన్య ప్రాణులను వేటాడుతూ నాటు తుపాకితో పట్టుబడిన ప్రభాకర్‌ను చూపుతున్న ఫారెస్ట్ అధికారులు

వన్యప్రాణులను వేటాడుతున్న వ్యక్తులపై దాడి

- ఒకరు అరెస్టు, ముగ్గురు పరారీ

ప్రజాశక్తి - రుద్రవరం : నల్లమల అడవుల్లో వన్య ప్రాణులను వేటాడుతున్న వ్యక్తులపై దాడులు నిర్వహించినట్లు రుద్రవరం అటవీ రేంజ్ ఇంచార్జ్ రేంజ్ ఆఫీసర్ ముత్తుజ వలి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల డిడి పిటి అనురాగ్ మీనా (ఐఎఫ్‌ఎస్)ఆదేశాల మేరకు రుద్రవరం సబ్ డి ఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ఈ నెల 27న అహోబిలం నార్త్ బీటులోని నూతల బావి రస్తా సమీపంలో అహోబిలంకి చెందిన వేటగాళ్లు కొందరు అడవుల్లో జంతువులను వేటాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. నాటు తుపాక తో అడవి జంతువులను వేటాడుటకు వచ్చిన అహోబిలంకి చెందిన నలుగురు వ్యక్తులను అటవి సిబ్బంది గుర్తించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ముగ్గురు నిందితులు పరారయ్యారన్నారు. పట్టుబడిన వ్యక్తి పేరు కెప్రభాకర్‌గా గుర్తించామన్నారు. పరారిలో వున్న వ్యక్తులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. పట్టుబడిన ముద్దాయి కొమ్మి ప్రభాకర్ ఆళ్లగడ్డ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా మేజిస్ట్రేట్ ముద్దాయికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. దాడుల్లో సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ, బీట్ ఆఫీసర్, నాగహుస్సేనయ్య, బీట్ ఆఫీసర్,సురేంద్ర గౌడ్ ప్రొటెక్షన్ వాచెర్ సంజీవ, మంత్రునాయక్ పాల్గొన్నారు.

మారందొడ్డిలోనే సేవలందించాలి

ప్రజాశక్తి-సి బెళగల్

సచివాలయం ఉద్యోగులను మారందొడ్డి గ్రామంలోనే ఉండి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని గ్రామస్తులు సోమప్ప, రూబెన్, చిన్న రాముడు, చిన్న రాజు, మోజెస్, జీవన్ కుమార్, సైమన్, మధుసూదన్‌రావు, ప్రసాద్, తదితరులు ఎంపిడిఒ రాణెమ్మతో మొరపెట్టుకొన్నారు. గతంలో బ్రాహ్మణ దొడ్డి పంచాయతీలో ఉన్న మారందొడ్డి జనాభాలో కూడా పెద్దదని ప్రస్తుతం కొత్తగా మా గ్రామం పంచాయతీ అయ్యిందన్నారు. అయినా బ్రహ్మణదొడ్డిలోనే సేవలు అందుకోవాల్సి ఉందని వాపోయారు. సచివాలయం భవనం కూడా బ్రాహ్మణదొడ్డికి, మారందొడ్డికి మధ్యలో సేవాయోగ్యంగా లేని ప్రాంతంలో నిర్మించారని మా గ్రామంలో పశు వైద్యశాలలో ఉద్యోగులకు సౌకర్యంగా ఉందని న్యాయం చేయాలని కోరారు.


ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న మారందొడ్డి గ్రామస్తులు

ఎల్లో బుక్కు హామీలు గాలికి...

- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో ఎల్లో బుక్కులోని హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి విమర్శించారు. సోమవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 39, 40, 41, 42 వార్డులకు సంబంధించి బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం రోజాకుంట షాదిఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024 ఎన్నికలలో అమలు చేయలేని హామీలను గుప్పించి ప్రజలను మోసం చేశారని, సంక్షేమ పథకాలు అందించాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలంటూ రాష్ట్ర మంత్రి మాట్లాడుతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని మోసం చేసి అధికారం చేపట్టిన కూటమి నేతలను ఆ పథకాలను అమలు చేయాలని కోరితే అడిగిన వారి నాలుక మందమని అవమాన కరంగా మాట్లాడటం సరికాదన్నారు. సంపద సృష్టిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నేడు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. సాధ్యం కాని పథకాలను ప్రజల ముందుకు తీసుకువచ్చి మోసం చేశారని, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కక్షపూరితంగా వైసిపి నేతలను, ప్రభుత్వ ఉన్నత అధికారులను, సోషల్ మీడియా ప్రతినిధులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నడుస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రజలకు తెలియజేయాలని వైసీపీ కార్యకర్తలను, నాయకులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగి శెట్టి శ్రీధర్, వైసిపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ శశికలారెడ్డి, కౌన్సిలర్స్ గొల్ల లక్ష్మీదేవి, పున్న రాజేశ్వరి, ఎస్‌పి శిరీష, మాజీ కౌన్సిలర్స్ లక్ష్మి నారాయణ, పున్న శేషయ్య, కిరణ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి